# తాబీడు

అప్పుడు నా ప్రపంచాన్నంతట్నీ నాశనం చేసుకుని...

ఆ గుహలో స్టాలగ్మైట్ దిమ్మమీద సమాధిలో కూచుని రంగుల తపస్సులో వున్నప్పుడు...

అప్పుడు... అడవి చీకట్లో ఆకు తొడిగిన ఒక మొలక నా ఎదుటికొచ్చి నవ్వింది.

నేను నాశనం చేసుకున్న నాప్రపంచం మళ్ళీ మొదలైంది మసకమసగ్గా...

ఆకుతొడిగిన మొలక వేళ్ళతో సైగలు చేస్తూ ఆకుల్తో నడుస్తూ వచ్చి నాముందు నగ్నంగా నిల్చుంది.

"పోవే పిల్లమొలకా! పిచ్చిమొలకా! మొలకెత్తీ ఎత్తకనే ఆకుల్తోటి దేక్కుంటూ వేళ్లు విరుచుకునొస్తున్నావు. సిగ్గులేదు ఫో... ఫో... నాప్రపంచం లేస్తోంది..." అన్నాను. సగం సమాధిలో... సగం తపస్సులో... కొంచెకొంచెం తపస్సమాధిలో...

ఒక పూర్తిగా సపస్సులో...యింకో పూర్తిగా తమాధిలో...!

దిగంబరంగా వున్న ఆ పిల్లమొలక... ఆ పిచ్చిమొలక అందీ ధయిర్రెంగా... "సగం మేలుకున్న వాడా... లేస్తోంది నీ ప్రపంచమన్న భ్రమలో వున్నావు... సమంగా చూడు... నీనాశనమైన ప్రపంచంలోంచీ నేను మేమై... మేముగా మేమే నేనులుగా మరో ప్రపంచం లేస్తోంది. ఆ స్టాలక్టైట్ మొనకు తల్లకిందులుగా వేల్లాడ్తూ సమాధై చూడూ."

"అప్పుడు నీ ప్రపంచం నాకు తలకిందులై కనిపిస్తుంది కదా?" అన్నాన్నేను సపస్సులోంచే తమాధిలోంచే...!

"సంపూర్ణ వృత్తానికి తలకిందులేమిట్రా... అందునా ఇది సంపూర్ణ వృత్తాకార దర్పణమాయె... అందుకే మాయలన్నీ... అవునూ... నేన్నీకెలా కనిపిస్తున్నానూ?" అందా మొలకపిలక.

"ఛీ...ఛీ... దిగంబరంగా... అదీ తలకిందులై ఆకుల్తో దేక్కుంటూ వేళ్ళు విరుచుకుని నిర్లజ్జగా... అబ్బ ఛీ" అన్నాన్నేను.

"ఊర్ధ్వమూల మధః శాఖం గురించీ తెలీదా నీకూ... వేళ్ళు పైకి, కొమ్మలు కిందకీ...? వేళ్ళు చరుచుకుని వికవికా నవ్వింది మొలకపిల్ల.

"అది ఆధ్యాత్మిక రహస్యం... యోగ మాయ... విశ్వరహస్యం... రెండాకుల పిలకా నీకెంత ధయిర్రెం...దాన్ని కోట్చేయడానికీ హమ్మా!" బెదిరిస్తున్నట్టున్నాను.

"సరే పోనీ నేనున్నట్టుండి ఇప్పుడో పువ్వు పూసేస్తాను... దాని రంగులకీ పరిమళాల హంగులకీ స్టీఫెన్ హాకింగ్ వస్తాడు... చక్రాల కుర్చీలోంచీ లేచి... అతన్నడుగుదాం ఏం?" అంది మొలక.

"నీకేం తెలుసే పిచ్చి మొహమ్మా! అతను తాపత్రయాలమీద నమ్మకం లేనివాడు. నువ్వు పువ్వు పూస్తే వచ్చేసాడా? అసలు తాపత్రయం ఏమిటేమిటో తెలుసా నీకు? ఆధ్యాత్మికం. అధి భౌతికం. అధి దైవికం...!" నాజ్ఞానానికి నేనే మురుస్తూ అన్నా.

"ఎందుకు రాడూ... హాకింగుకి రంగులు చూట్టం. వాసనలు పీల్చడం మహబాగా తెలుసు... నీకే అస్సలేం తెలీదు... అతను కాంతి పరిమళాల్నీ కాలపు రంగుల్నీ చూస్తాడు."

"ఫో... ఫో... పుట్టి పది నిమిషాలైనా కాలేదు. నాకు చెప్పొచ్చావు వెధవ పిలకా?"

"ఒరే తమాధి సమస్సులో వున్న తల్లకిందుల వాడా హిరోషిమాలో నాగసాకిలో విస్పోటం జరిగినప్పటికే నాకెన్నేళ్ళో తెలీదు. నాపుట్టుక గురించీ నీకేం తెల్సూ?" అంది మొలకపిల్ల.

"నాకు దానికి ధ్రువీకరణ పత్రం కావాలి... నీ డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ చూయించు."

"గ్వెర్నికా తెలుసా? పికాసో... పికాసో.... ఫ్రెంచ్ పెయింటర్... ఆ గ్వెర్నికా పెయింటింగ్ కింద మూలలో నేనున్నాను చూసుకో ఫో" అంది మొలక.

"అదీ... గ్వెర్నికా అనే వూరి మీద జరిగిన దాడిలో బీభత్సాన్ని చూపిస్తూ పికాసో గీచాడూ..."

"అదే మరి నేనేమంటున్నానో తెలుసునీకు. తెలీనట్టు నగం కళ్ళు మూసుకుంటావేం. జ్ఞానంధకారంలో తన్నుకుంటున్నావు నువ్వు...!"

"కాంట్రడిక్షన్... కాంట్రడిక్షన్... జ్ఞానం అంధకారం కాదు... తేజస్సు తేజస్సు" గొంతు చించుకు అరిచాననుకున్నాను.

ఆశ్చర్యం...! నాగొంతు నాకే వినిపించలేదు. ఎక్కడో నూతిలోంచీ వస్తున్నట్టు పీలగా.. వినిపించీ వినిపించక శబ్దించింది.

"అదేనురా అంటున్నానూ సగం కళ్ల మూతవాడా! నీ జ్ఞానం అంధకారమే" అంది పిలక పిల్లమొలక... మొలక పిల్ల...

"హిరోషిమా నాగసాకీ అప్పటికే నీకెంత వయసో తెలీనప్పుడు... నీకు క్వార్క్సు... లెప్టాన్స్సు... ఫోర్స్ క్యారియర్ బోసాన్స్ గురించి తెలుసా?"

అయిపోయింది పిల్లమొలక నాజ్ఞానసాగరంలో మునిగి తన్నుకు చావాల్సిందే యిక అనుకున్నాను.

"వూల్ఫ్‌గాంగ్ పాప్లీకి పంతొమ్మిది వందలా ముప్పయిలో నేనే చెప్పాను. వాటి సంగతీ... ఎన్రీకో ఫెర్మీకి 'న్యూట్రినో'లు అన్న పేరు సజెస్ట్ చేసింది ఎవరనుకున్నావ్...?!" వేళ్లు ఛెళ్‌మని ఝళిపించి నవ్వింది మొలక.

"పిల్లమొలకవైనా పిడుగువే" అన్నాను

"అరిష్టశయ్యాం పరితో విసారిణా

సుజన్మన స్తస్య నిజేన తేజసా అనే శ్లోకం తెలుసా నీకు.. కాళీదాసుకు ఆ శ్లోకాన్ని కలలో చెప్పింది నేనే...

మా పసితేజస్సు ముందు మీరంతా దీపపు బొమ్మల్లాంటి వాళ్లు..."

"మరీ విర్రవీగకు... వేళ్ళుగాల్లో వున్నాయి..." అని వాక్యం పూర్తీ చేసేంతలో తాబేలు సైజు సాలీడు ఒకటి తీగలు సాగుతూ వచ్చి "నా చిక్కుల్లో ఎవరు చిక్కుకుంటారూ?" అనడిగింది.

"నేను చిక్కుకుంటాను కానీ రసీదిస్తావా?" అడిగింది మొలక.

"అమ్మా!... అల్లిబిల్లిగా అల్లేసి కట్టేసి కుట్టేసి కృశింపచేసి భోయనం చేసి ఏమీ మిగల్చకుండా చేసేస్తాగా... రసీదెందుకూ యింకా?" అంది తాబేలు సాలీడు... తాబేలీడు... తాబీడు!

"మరీ సమ్మోహకారాలు లేకుండా చిక్కుబడ్తారేంటి ఎవరేనా?" అడిగింది మొలక.

"అవును మరీ... నీ గూటిలోకి వూరికే ఎవరొస్తారూ... ఏమైనా చూపించూ" అన్నా నేను కూడా మొలకతో పార్టీ కట్టినట్టు నటిస్తూ...?

"అయితేసరే... చిటికేస్తే మండే దీపం బుడ్డి ఇస్తా"... అంది తాబేలీడు.

"చాలదు" అన్నాం మొలకా నేనూ.

"కాలువ తవ్వించి సముద్రాన్ని మీ వీధులకి మళ్ళిస్తా" ఎర్రటి కనుగుడ్లతో ఆశగా చూస్తూ అంది తాబీడు పురుగు.

"అబ్బే!" చప్పరించాం.

"వూ... యింకేమివ్వనూ... ఆఁ... ఆకాశం మీ ముంగిట్లో వాలేట్టు చేస్తా."

"వూఁ.హూ..." తలడ్డంగా వూపాం.

తాబేలీడు కాస్సేపు ముక్కి పొట్టకిందనించీ ఓ విత్తనం లాంటిది తీసింది. "ఇదిగో యిదిస్తా" అంది.

"ఏమిటదీ?"

"హైహైహై బ్రీడు విత్తనం... ఒక్కిత్తనం వేస్తే చాలా ఏపురుగూ కొట్టలేని పంట ఎకరాల కెకరాలు పండేస్తుంది. ఒకే విత్తనం చాలు... పండును చేలు ఎకరాలు వేనవేలు..." అడ్వర్టైజ్మెంట్ పాటలా పాడింది తాబీడు.

"లాభంలేదు పురుగా" వేళ్ళు విదిలించింది మొలక.

చిత్రంగా దాని రెండాకులూ ఆకుపచ్చతనం కోల్పోతున్నాయి.

పాపం పిల్లమొలక ఎండిపోతుందేమో జాలిపడాలి అనుకున్నా. తాబేలు సాలీడు కాస్సేపు ముక్కి, కడుపుకిందినించీ ఓ మడతలు పెట్టిన గుడ్డముక్క తీసింది.

"ఏమిటీ?" అడిగా.

"ఇది మాపార్టీ జెండా... ఎన్ని తుపానులూ... ఎన్ని విపత్తులూ... ఎంతకరువూ... ఏ ఎండా... ఏమైనా కానీ... మా జెండా నీడన వుంటే చల్లగా వుంటుంది" వూరిస్తూ అంది తాబీడు.

ఎర్రటి కళ్లతో మావేపు ఆశగా చూస్తోందది కోరలు విచ్చుకత్తుల్లాగున్నాయి.

నాకు చిన్నగా ఆశపుట్టడం మొదలైంది. సాలోచనగా మొలకవేపు చూశా. తల వూపింది మొలక ఒద్దొద్దన్నట్టు.

నేను తన మాటలకు లోబడుతున్నాననని గ్రహించి తాబీడు యింకా అంది. "ప్రపంచంలోని జ్ఞానమంతా మీటనొక్కగానే నీ ముందు ప్రత్యక్షమయ్యేట్టు చేస్తా... రాస్తాలన్నీ రాజస్థాన్ మార్బుల్స్ పరిపిస్తా... ఎర్రబస్సులన్నీ ఏసీ చేపిస్తా."

నా సగం తెరచిన కళ్ళు మత్తెక్కుతున్నాయి.

"దేశమ్మొత్తాన్ని చిన్న ఇంటిగ్రేటేడ్ సర్క్యూట్ మీద నడిపిస్తా... పత్తికాయల్లో పాలియెస్టర్ ఫైబరొచ్చేట్టు చేస్తా... జిల్లేడు చెట్లకు సోనా మసూరీ కంకులొచ్చేట్టు చేస్తా... పోలీసులు పూలగుత్తులు పట్టుకు తిరిగేట్టు చేస్తా...

"ఒక్కో తీగా నన్నల్లుకుంటూంది. మైకంగా ఉంది అసలే సపస్సు తమాధిలో వున్నాను కదా...!"

మొలకపిల్ల ఏమో అంటోంది... వినిపించడం లేదు నాకు... కానీ సగం కళ్లకి మొలక ఆకుల రంగు ఆకుపచ్చతనం వదలి లోహిత వర్ణం సంతరించుకోవడం లీలగా కనిపించింది.

నాకు తాబీడు కీటకంమాటల మత్తే బాగుంది.

మొలక ఎందుకు తాబీడుకి లొంగడం లేదు...? దాని జ్ఞానం తెలుసుకున్న నేను మొలక మాట వినక తాబీడు కెందుకు లొంగుతున్నాను...?

ఆఁ... పిల్లమొలక దీని మాటకు విలువిచ్చేదేంటని... అని కాదూ...?

అది మొలకేనా అసలు...?!

నా మత్తుకళ్ళకి... చొల్లుకారుస్తూ జోగుతున్న నాకు మాత్రం మొలకలా కనిపిస్తోందా...?

ఊర్ధ్వమూల మధః శాఖం అంది...!

ప్రపంచ యుద్ధాలకంటే వెనకటి దాన్నంది...!

నాకెందుకూ ఈ పిల్లమొలక పిచ్చి మొలకలా కనిపిస్తోంది...?!

తాబీడు తలమీది యాంటెన్నే బీప్ బీప్‌మన్నాయి... ఎలక్ట్రానిక్ క్లేర్వాయన్స్... ద్వారా తాబీడుకి నాఆలోచనలు తెలిసినట్టుంది.

"హలో చూడూ... నీ సపస్సు కోసం నీ తమాధికోసం కొండలన్నీ కుళ్ళబొడిపించి గుహలు తవ్విస్తా... ఇక్కడ తీసే సిన్మాలోనీకేం కావాలన్నా పెట్టిస్తా.... ఎంటర్టయిన్మెట్ట్యాక్స్ లేకుండా చేస్తా ... అఆఇఈ విద్యామంత్రితో వైస్ ఛాన్సలర్లని ఎడాపెడా తిట్టిస్తా... సూదెయ్యడం రాని డాక్టర్మంత్రితో సూపర్ స్పెషలిస్టుల భ్రష్టు దులుపిస్తా. నువ్వు కళ్లు మూసుకుని స్మరిస్తే కోరుకునే చోటుకెళ్లేట్టు చేస్తా...

ముందు బ్రిడ్జిలు కట్టించి తర్వాత నదులు పుట్టిస్తా... మీలాంటి అమాయక ప్రజ శ్రమపడ్తూ ఎండకెండకుండేందుకు కోట్టుపెట్టి టోపీలేయిస్తా... పొయ్యిలేకుండా అన్నమొండే గిన్నెనిప్పిస్తా... అసలు ఆకలే లేకుండా రాకుండా చిప్స్ మింగిస్తా...

ఎర్రబారిన ఆకుల్తో మొక్క నిరసిస్తూ గుహలోంచీ బయటికి దారి చూసుకుంటోంది. మత్తెక్కిన నేను తాబీడు వలలో చిక్కుకుంటున్నాను.

తాబీడు వల నా చుట్టూ అల్లుకుంటోంది.

గుహలోంచీ బయటికెళ్లిపోయిన మొక్క యింకో మొక్కల సామాహాన్నేసుకుని వచ్చి గుహ ముఖంలో నిల్చుంది.

"తాబీడు ముర్దాబాద్... వాగ్దానాల పురుగు నశించాలి... ఒరే ఎరను మింగుతున్నావురా! కోలుకో... మేలుకో... తెలివి తెచ్చుకో ... తాబీడు వుచ్చు తెంచుకో... మూకుమ్మడిగా అరుస్తున్నాయి... వేళ్లు ఊర్ధ్వలోకాలకి చాచి...!

✽